క్లుప్తంగా

నేడు హెచ్‌ఎంలతో సమీక్ష

మధురపూడి: కోరుకొండ మండలం మధురపూడి విమానాశ్రయం సమీపంలోని వికాస పార్మసీ కాలేజీలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్. అబ్రహం ఆధ్వర్యంలో గురువారం నాడు–నేడుపై సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ కుశలవ దొర తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరిగే ఈ సమావేశంలో కోరుకొండ, రాజానగరం, సీతానగరం, గోకవరం మండలాలకు చెందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొంటారన్నారు.

గ్రంథాలయానికి ఫ్యాన్ల వితరణ



లైబ్రేరియన్‌కి ఫ్యాన్లు అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: స్థానిక గ్రంథాలయానికి గ్రామానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖుడు మండవిల్లి వెంకటేశ్వరరావు రెండు సీలింగ్ ఫ్యాన్లను వితరణ చేశారు. గ్రంథాలయంలో ప్రస్తుతం విద్యార్థులకు వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫ్యాన్ల అవసరాన్ని గుర్తించి, అందజేశానని దాత తెలిపారు. వేసవి శిక్షణా తరగతులలో భాగంగా పది రోజులుగా విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు చదివించడం, నీతి పద్యాలు నేర్పడం, చెప్పించడం, తెలుగు పదాలు నేర్పడం, పేపరుతో క్రాఫ్ట్స్ (బొమ్మలు, ఇతర వస్తువులు) తయారు చేయించడం నేర్పిస్తున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు జరుగుతున్న ఈ తరగతులు జూన్ 11 వరకూ కొనసాగుతాయని లైబ్రేరియన్ కె.సత్యనారాయణ తెలిపారు.

రేపటి నుంచి వలంటీర్లకు అవార్డు ప్రదానోత్సవాలు

రంగంపేట: ఈ నెల 19వ తేదీ శుక్రవారం నుంచి 23వ తేదీ వరకూ అన్ని గ్రామ పంచాయతీల వద్ద వలంటీర్లకు అవార్డు ప్రదానోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.శ్రీరామరాజు తెలిపారు. ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్నలతో పాటు ఆయా గ్రామాల నోడల్ అధికారులు హాజరై అవార్డుకి ఎంపికైన వలంటీర్లను సత్కరించి పురస్కారాలు అందజేస్తారన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

అనపర్తి: మండలంలోని మహేంద్రవాడ, అనపర్తి గ్రామ పంచాయతీల పరిధిలో ఖాళీగా ఉన్న మూడు గ్రామ వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ బీఎల్ నరసింహం బుధవారం తెలిపారు. అనపర్తి గ్రామ పరిధిలో ఖాళీగా ఉన్న 2 వలంటీర్ పోస్టులకు గాను ఎస్సీ–మహిళ, మహేంద్రవాడలో ఒక పోస్టు ఓసీ–మహిళకు రిజర్వు చేశారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

25న బహిరంగ వేలం

పెదపూడి: మండలంలోని పుట్టకొండ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ భూములకు మూడేళ్లకు వర్తించేలా బహిరంగ వేలం పాట ఈ నెల 25న నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సీహెచ్‌వీ రమణమూర్తి తెలిపారు. చింతపల్లిలో 4.30 ఎకరాలు, గండ్రేడులో 1.68 ఎకరాలు, కుమారప్రియంలో 97 సెంట్లు, శహపురంలో 4.05 ఎకరాలు, పుట్టకొండ ఆలయ ప్రాంగణంలో కొబ్బరి చెట్లకు వేలం పాట జరుగుతుందన్నారు. ఆసక్తి గల రైతులు రూ.5 వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు.

బైబిల్ శిక్షణ తరగతులు

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి లూథరన్ చర్చిలో చిన్నారులకు బైబిల్ శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. వీటిని ఆదివారం వరకూ నిర్వహిస్తారు. చిన్నారులకు బైబిల్‌పై సంపూర్ణ అవగాహన కల్గించాలన్న ఉద్దేశంతో వీటిని నిర్వహిస్తున్నారు. ఆదివారం ముగింపు సభ సందర్భంగా చిన్నారుల ప్రదర్శనలు ఉంటాయి. అనంతరం బహుమతుల ప్రదానం జరుగుతుంది. కార్యక్రమంలో రెవరెండ్ పాస్టర్ జె.ఇశ్రాయేలు, సంఘపెద్దలు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

మధురపూడి: ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి అనుసరణీయమని ఆర్‌సీఎం రెవరెండ్ ఫాదర్ మనోజ్ కుమార్ తెలిపారు. కోరుకొండ మండలం బూరుగుపూడి చర్చిలో బుధవారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ బైబిల్ పఠనం ద్వారా ప్రశాంతత దక్కుతుందన్నారు.

చలివేంద్రం ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని 3, 4 డివిజన్లకు చెందిన ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఎదురుగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఎంపీ భరత్ రామ్ ప్రారంభించారు. బాటసారులకు, వాహనచోదకులకు ఆయన మజ్జిగ వితరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాసేవలో వైఎస్సార్ సీపీ నాయకులు అత్యంత ఉత్సాహంగా పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మూగజీవాలకు, పశుపక్ష్యాదులకు కూడా ఆహారం, నీరు అందించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, నక్కా శ్రీనగేష్, బళ్లా శ్రీనివాసరావు, పల్లా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నీరు పుష్కలం.. రైతుల హర్షం..

- ఆదుకుంటున్న తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్
- 13,482 ఎకరాలకు సాగునీరు
- సుమారు 10 వేల మంది అన్నదాతలకు లబ్ధి



పురుషోత్తపట్నంలోని తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్

సీతానగరం: పురుషోత్తపట్నంలోని తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ రైతుల పాలిట సంజీవనిగా నిలిచింది. దీనిద్వారా మండలంలోని 13,482 ఎకరాల ఆయకట్టుకు ఖరీఫ్‌లో నీరందుతోంది. ఈ స్కీమ్‌ను 1964లో నెలకొల్పారు. అయితే పాత స్కీమ్‌ను తొలగించి, తిరిగి కొత్త భవనంలో మూడు పంపుల ద్వారా 18 డిసెంబర్ 2003లో నీరందించడం ప్రారంభించారు. ప్రధాన కాలువ పొడవు 3.925 కిలోమీటర్లు ఉండగా అక్కడ నుంచి ఎడమ కాలువ పొడవు 22 కిలోమీటర్లు, కుడి కాలువ పొడవు 17 కిలోమీటర్లు ఉంది. పురుషోత్తపట్నం నుంచి బొబ్బిల్లంక వరకు అధికారికంగా 13,482 ఎకరాలకు టీపీ స్కీమ్ ద్వారా నీరు అందిస్తున్నారు. ఈ స్కీమ్‌కు బడ్జెట్ నిధులు కేటాయించి స్కీమ్ అభివృద్ధికి పెద్దపీట వేశారు. ఇందులో మూడు మోటార్లు ఉండగా, అందులో ఒకటి స్టాండ్‌బైగా ఉంటుంది. ఒక్కొక్క పంపు 120 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుంది. ప్రతిరోజూ రెండు పంపుల ద్వారా 240 క్యూసెక్కుల నీటిని వదులుతారు.

నెల రోజుల ముందే నీరు విడుదల

ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరవతో నెల రోజుల ముందుగానే సాగునీరు అందిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రతి ఏడాది జూలై ఆఖరు వారంలో సాగునీరు అందించేవారు. రెండో పంటకు రైతుల నుంచి నగదు వసూలు చేసినా, సక్రమంగా నీరు అందించేవారు కాదు. దీనికి భిన్నంగా మూడేళ్ల నుంచి నుంచి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా జూన్ మొదటి వారంలో సాగునీరు పుష్కలంగా అందించారు. అలాగే రబీలో వేసే ఆరుతడి పంటలకు పుష్కలంగా సాగునీరు అందిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పంటలు పుష్కలంగా పండుతున్నాయని, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సాగునీరును అందించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాగునీటి ఇబ్బందులు లేవు



ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చొరతో ఖరీఫ్‌లో వరిపంటకు నెల రోజుల ముందుగానే సాగునీటిని అందిస్తున్నారు. వరి ఆకుమడులకు స్కీమ్ నుంచి వచ్చిన నీటినే ఉపయోగిస్తున్నాం. గత టీడీపీ ప్రభుత్వంలో జూలై నెలాఖరుకు సాగునీరు అందించినా, సక్రమంగా ఇచ్చేవారు కాదు. వరి ఆకుమడులకు నీరు పెట్టడానికి చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు సాగునీటికి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేవు. రబీలో కూడా ఆరుతడి పంటలకు పుష్కలంగా నీరందించడంతో ఎంతో ఆనందంగా ఉంది. పంటలు చక్కగా పండించుకుంటున్నాం.

– గద్దె వీరన్నబాబు, రైతు, రామచంద్రపురం

సమృద్ధిగా నీరు



ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హయాంలో రెండు పంటలకు పుష్కలంగా సాగునీరు అందుతోంది. పంటలు చక్కగా పండుతున్నాయి. రబీలో వేసిన వరికి, అలాగే మొక్కజొన్నకు కూడా నీరు సమృద్ధిగా లభిస్తోంది. టీడీపీ ప్రభుత్వంలో ఖరీఫ్‌కు నీరు సక్రమంగా అందించేవారు కాదు. రెండోపంటకు నీరు అందించడానికి రైతుల నుంచి డబ్బులు వసూలు చేసేవారు.

– ముదునూరి రామకృష్ణరాజు, రైతు, చినకొండేపూడి

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు



గండ్రేడులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- గండ్రేడులో గడప గడపకూ మన ప్రభుత్వం

పెదపూడి: ప్రతి కుటుంబానికి ప్రభుత్వ లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో అందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. గండ్రేడు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ప్రజలతో మమేకమై ఆప్యాయంగా పలకరించారు. జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో ఏ కుటుంబానికి ఎంత మేర లబ్ధి చేకూరిందో వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీల్లో సుమారు 99 శాతం నెరవేర్చిన గొప్ప ముఖ్యమంత్రి జగన్ అని కొనియాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ వలంటీర్, సచివాలయం వ్యవస్థలు ఏర్పాటు చేసి ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా జగన్ సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాల అమలు తీరును క్షేత్రస్థాయిలో తెలుసుకోవడానికే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాలయ వెంకటలక్ష్మి, రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, సర్పంచ్ కుడిపూడి మాధవీలత, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, పార్టీ మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, ఉప సర్పంచ్ కర్రి శ్రీను, మండల క్రిస్టియన్ సెల్ కన్వీనర్ సాంబత్తుల చంటి పాల్గొన్నారు.

పల్లెల ప్రగతికి ప్రాధాన్యం



బ్రహ్మల కాలనీలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పల్లెల ప్రగతికి ప్రాధాన్యం ఇస్తుందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. గోకవరంలో పలు అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపనలు చేశారు. స్థానిక బ్రహ్మల కాలనీలో శిథిలావస్థకు చేరిన సీసీ రోడ్డు స్థానంలో రూ.5 లక్షలతో రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. బంగాళాపేటలోని డ్రైనేజీ నిర్మాణానికి, ఊరకాలువలోకి మెట్లు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అలాగే 11 కేవీ విద్యుత్ సమస్య గురించి బంగాళాపేట వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పాటి రాంబాబు, నాయకులు సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, కర్రి సూరారెడ్డి, నరాలశెట్టి నర్సయ్య, తోలేటి రాంప్రసాద్, బిజ్జి రాజు, రౌతు జోగేశ్వరరావు, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు మీరితే చర్యలు



ఆటో యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న డీఎం రామన్న

గోకవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం ఆటో యూనియన్ నాయకులతో డిపో మేనేజర్ యు.రామన్న సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలు, ప్రైవేట్ వాహనాలను బస్టాండ్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంచుకుని వ్యాపారాలు చేసుకోవాలన్నారు. రోజూ బ్రేక్ ఇన్‌స్పెక్టర్ చెకింగ్ ఉంటుందని, ఈ నిబంధన మీరితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. తమ సిబ్బంది బస్టాండ్ బయట విధులు నిర్వహిస్తారని, వారితో ఎటువంటి వాగ్వాదాలకు పాల్పడకుండా సహకరించాలన్నారు. డిపో సూపరింటెండెంట్ అడ్డాల అప్పారావు, టీఐ జి.కృష్ణ, ఆర్టీసీ యూనియన్ నాయకులు పైడిమళ్ల లక్ష్మణ్‌రావు, ప్రగడ ప్రసాద్, నల్లా సత్తిబాబు, ఆటో యూనియన్ నాయకుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ సుంకర శ్రీవల్లి అధ్యక్షతన బుధవారం జరిగింది. దీనికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రైతు సమస్యలపై పలువురు సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతులతో వ్యవసాయ శాఖ అధికారులు సమావేశాలు నిర్వహించి సాగుపై తీసుకోవాల్సిన సలహాలు, సూచనలు అందజేయడం లేదన్నారు. ఎమ్‌టీయూ 1156 వరి వంగడం పంటను అధికారులు తీసుకోవడం లేదన్నారు. రైతులు తమ పండించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించినప్పుడు వాహనాలకు రవాణా ఖర్చులు ఇవ్వడం లేదన్నారు. దీనిపై ఏఓ రాజేశ్వరి మాట్లాడుతూ ఈ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రంపయర్రంపాలెంలో ఇటీవల పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలు కోర్టు వివాదంలో ఉన్నాయని, రెవెన్యూ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని సభ్యులు ఆరోపించారు. అలాగే భూముల రీసర్వేపై రైతులకు ఎటువంటి ధ్రువపత్రాలు ఇవ్వడం లేదన్నారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులు మాట్లాడుతూ భూ సర్వే పూర్తయిన రెండు రోజులలో సర్వే పత్రాలు రైతులకు ఇస్తామన్నారు. గోకవరం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య అధికంగా ఉంటుందని, రోగులకు ఇబ్బంది లేకుండా టోకెన్ సిస్టం అమలు చేయాలని సభ్యులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, పార్టీ మండలాధ్యక్షుడు పాటి రాంబాబు, నాయకులు సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, ఎంపీడీఓ కేవీఎస్‌ఎస్ఎన్ మూర్తి, వైస్ ఎంపీపీలు మడికి మైనర్‌బాబు, గోకాడ చిట్టిబాబు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై సదస్సు

కంబాలచెరువు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశానుసారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి మాట్లాడుతూ బాలలు, మహిళల రక్షణకు ఉన్న చట్టాలను తెలిపారు. బాలల సంరక్షణ కోసం నల్సా చైల్డ్ ఫ్రెండ్లీ లీగల్ సర్వీసెస్ స్కీమ్‌ను ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ అందిస్తున్న న్యాయసేవలు, విధులపై అవగాహన కల్పించారు. సదస్సులో పాల్గొన్న జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ పీఎస్ రమేష్ మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల విద్యార్థులకు అందుబాటులో ఉన్న వివిధ సంక్షేమ పథకాలను వివరించారు. డీఎస్ఎం డాక్టర్ పి.లక్ష్మి మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వెనుకబడిన ప్రజలకు అందుబాటులో ఉన్న పెన్షన్లు వివరించారు. సదస్సులో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ పి.సూర్య ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

సంరక్షణ కష్టమే..

- మండుతున్న ఎండలు
- విలవిల్లాడుతున్న మొక్కలు
- కాపాడుకునేందుకు నర్సరీ రైతుల తలమునకలు



ఎండ తీవ్రతకు వాడిపోతున్న మొక్కలు



నీటిని అందిస్తున్న కూలీలు

కడియం: మండుతున్న ఎండల కారణంగా కడియం ప్రాంత నర్సరీల్లోని మొక్కలు విలవిల్లాడుతున్నాయి. కడియం, చుట్టు పక్కల ప్రాంతాల్లో 45 నుంచి 48 డిగ్రీల వరకు ఎండల తీవ్రత నమోదవుతోంది. రెండు, మూడు రోజుల నుంచి ఇది పెరుగుతూ వస్తోంది. ఎండ తీవ్రత పెరిగే కొద్ది పచ్చటి మొక్కలను కాపాడుకోవడం కోసం నర్సరీ రైతులకు కష్టతరమవుతోంది. గతంలో మూణ్ణాలుగు రోజులకు ఒకసారి తడి అందిస్తే సరిపోయేది. కానీ ఉష్ణోగ్రతలు భారీగా పెరిగిపోవడంతో రోజు విడిచి రోజు నీటిని అందించాల్సి వస్తోంది. లేకపోతే రెండో రోజుకే మొక్కలు తలలు వాల్చేస్తున్నాయి.

సున్నిత మొక్కలపై ప్రత్యేక శ్రద్ధ

అత్యంత సున్నితంగా ఉండే ఇండోర్ ప్లాంట్లు ప్రస్తుత వాతావరణానికి మరింత దెబ్బతింటున్నాయని రైతులు చెబుతున్నారు. అలంకరణ మొక్కలపై ప్రజలకు ఆసక్తి పెరగడంతో వీటి దిగుమతులు ఇటీవల పెరిగాయి. మేలో వచ్చే అధిక ఉష్ణోగ్రతల నుంచి వీటిని కాపాడుకోవాలంటే పాలీ హౌస్‌లు, షేడ్‌నెట్లు ఏర్పాటు చేయాలి. వీటిని భిన్న వాతావరణ పరిస్థితుల్లో వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి తీసుకువస్తారు. సాధారణ వాతావరణానికి విరుద్ధంగా మేలో మన ప్రాంతంలో ఉష్ణోగ్రతలు ఉంటాయి. దీంతో వీటి సంరక్షణ రైతులకు సవాల్‌గా మారుతోంది.

కూలీల కొరత

కడియం ప్రాంత నర్సరీల్లో దాదాపు 300 రకాలకు పైగా అలంకరణ, ఫల, పుష్ప రకాల మొక్కలను రైతులు ఉత్పత్తి చేస్తుంటారు. వీటిలో అతి చిన్న ఐదు అంగుళాల బ్యాగ్ నుంచి 50 అంగుళాల బ్యాగు సైజు వరకు మొక్కలను తయారు చేస్తారు. పెద్ద సైజు బ్యాగుల్లో పెంచుతున్న మొక్కలు వేసవిలో తీవ్రంగా ప్రభావితం అవుతుంటాయి. వీటికి ఎప్పటికప్పుడు నీటిని అందించాలి. నేలమీద నీరు పారించడంతో పాటు, మొక్కలు ఉన్న ప్యాకెట్లలో సైతం నీటిని పోయాలి. ఇలా పోసేందుకు కూలీలను వినియోగిస్తారు. అయితే ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో కూలీలు కూడా పనుల్లోకి రావడానికి వెనకాడుతున్నారు. దీంతో సమయానికి మొక్కలకు నీటిని అందించడంలో ఆలస్యమైపోతోందని రైతులు వాపోతున్నారు. మధ్యతరహా నర్సరీలో పనులను బట్టి రోజుకు 10 నుంచి 30 మంది వరకు కూలీలు పనిచేస్తుంటారు. ఇప్పుడు అయిదారుగురు మించి పనులకు రావడం లేదని బుర్రిలంక గ్రామానికి చెందిన నర్సరీ రైతు ఎస్.సత్యనారాయణ తెలిపారు. వాస్తవానికి ఎండా కాలంలోనే మొక్కల ఎదుగుదల బాగుంటుంది. అయితే నీటి యాజమాన్యం విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా మొక్క ఎదుగుదల తీవ్రంగా ప్రభావితం అవుతుంది. ఈ కారణంగానే ఎండలు ఎంతగా పెరిగిపోయినా మొక్కలను అంటిపెట్టుకుని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, తగిన విధంగా నీటిని అందజేయాలి. వేసవిలో ప్రతి ఏటా ఉండే సమస్యే అయినప్పటికీ గత నాలుగు రోజులుగా పెరుగుతున్న ఎండల తీవ్రతను చూస్తుంటే రైతుల్లో ఆందోళన మరింతగా పెరుగుతోంది. ఇదే తీవ్రతతో ఎండలు మండితే మొక్కలను కాపాడుకోవడం కష్టమేనని భయపడుతున్నారు.

కూలీల కొరత ఉంది

వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా కూలీలు రావడం తగ్గింది. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12.30 వరకే పనిచేస్తున్నారు. రెండు పూటలా మొక్కలకు నీరు అందించడానికి ఇబ్బంది ఎదురవుతోంది. 46, 47 డిగ్రీలకు పైనే ఎండ తీవ్రత ఉంటోంది. మున్ముందు ఇంకా ఎంత పెరుగుతుందో తెలియదు. మొక్కలను కాపాడుకోవడానికి శతవిధాలా ప్రయత్నిస్తున్నాం.

– జి.శ్రీనివాసరావు, నర్సరీ రైతు, మురమండ

జగనన్న ప్రభుత్వంలోనే విద్యాభివృద్ధి



కోటికేశవరంలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

మధురపూడి: జగనన్న ప్రభుత్వంలో శరవేగంగా విద్యాభివృద్ధి జరుగుతోందని కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు అన్నారు. బుధవారం కోరుకొండ మండలం కోటికేశవరం, కోటి, బొల్లెద్దుపాలెంలో అదనపు తరగతి గదులు, ప్రహరీల నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జెడ్పీటీసీ నాగేశ్వరరావు మాట్లాడుతూ నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో సకల సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కుశలవదొర, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అడపా కనకరాజు, కోకన్వీనర్ గణేశుల పోసి పాల్గొన్నారు.

ఫైర్‌మన్ భాస్కరరావుకు సత్కారం



ఫైర్‌మన్ భాస్కరరావును సత్కరిస్తున్న జేసీఐ

కంబాలచెరువు: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ రాజమహేంద్రవరం ఛాంపియన్స్ ఆధ్వర్యంలో స్థానిక ఇన్నీసుపేట అగ్నిమాపక కార్యాలయానికి చెందిన సీనియర్ ఫైర్‌మన్ భాస్కరరావును బుధవారం సత్కరించారు. జేసీఐ అధ్యక్షురాలు దీప ఉప్పలూరి, సెక్రటరీ సౌజన్య ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భాస్కరరావుకు శాలువా కప్పి, బహుమతి ప్రదానం చేశారు. అధ్యక్షురాలు దీపా ఉప్పలూరి మాట్లాడుతూ ప్రమాద భరితమైన కార్యాలయాలలో పనిచేసే ఉద్యోగులను గుర్తించి వారిలో ఒకరికి ప్రతినెలా సన్మానం చేస్తున్నామన్నారు. భాస్కరరావు మాట్లాడుతూ తను 32 ఏళ్లుగా అగ్నిమాపక శాఖలో సేవలందిస్తున్నానన్నారు. కార్యక్రమంలో జేసీఐ సభ్యులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన

కడియం: జగనన్న హౌసింగ్ పథకం లబ్ధిదారులకు జేగురుపాడు గ్రామ సచివాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీకాంత్ పాల్గొని లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఇంటి స్థలం పొందిన వారు వెంటనే నిర్మాణం ప్రారంభించాలన్నారు. ఇందుకోసం ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎండలతో అప్రమత్తంగా ఉండాలి



చిన్నారులకు వేసవి జాగ్రత్తలను వివరిస్తున్న వైద్య సిబ్బంది

కడియం: చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణా శిబిరంలో చిన్నారులకు ఎండ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఎస్ఎం బి.సునీత అవగాహన కల్పించారు. పదో రోజు కార్యక్రమంలో భాగంగా పుస్తక సమీక్షలు నిర్వహించారు. కె.ప్రసాద్, రేఖ, రిషిత, సురేష్ వివిధ అంశాలను విద్యార్థులకు వివరించారు. లైబ్రేరియన్ శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ తరగతులు



చిన్నారులు తయారు చేసిన క్రాఫ్ట్ బొమ్మలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం వేసవి శిక్షణ తరగతులు కొనసాగాయి. పుస్తక పఠనం, నీతి కథలు చెప్పడం, హ్యాండ్ క్రాఫ్ట్, చిత్రలేఖనం, వేదిక్ మేథ్స్, తెలుగు పద్యాలు లలిత సంగీతం తరగతులు నిర్వహించినట్టు లైబ్రేరియన్ శ్రీదేవి తెలిపారు. జమిని రంగయ్య విద్యార్థులకు వేదిక్ మ్యాథ్స్ తరగతులు నిర్వహించి గణితంలో మెళకువలు నేర్పించారు. ఫ్రింటోనికా కలర్ ల్యాబ్ అధినేత గోకుల్ మురళీ విద్యార్థులకు మజ్జిగ వితరణ చేశారు. మాజీ సైనిక ఉద్యోగి మంగళంపల్లి సోమయాజులు విద్యార్థులకు స్నాక్స్ అందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.